# రాబర్ట్ విశ్వామిత్రుడి కథ

పగలు కొంతసేపు టైలరింగ్ షాపులో వుద్యోగం, కొంతసేపు చదువు (బి. కాం.), సాయంకాలం మళ్ళీ టైలరింగు, రాత్రి నాటకాల రిహార్సల్సు; చదువు ఇలా మూడేళ్ళు చేసి మా రెండోవాడు ఉన్నట్టుండి మద్రాసు బండెక్కేశాడు, సినిమాల్లో ఛాన్సులకోసం!

రెండురోజులు పోయాక ఉత్తరం వచ్చింది. "నాకు వేషం దొరికింది, ఫలానా పిక్చర్‌లో యాక్ట్ చేస్తున్నాను'' అని. డబ్బుకి ఇబ్బంది పడుతున్నాడో ఏమిటో అని; పోనీ పంపుదాం అంటే అందులో అడ్రస్ లేదు.

వాడు వేసింది ఒక సినిమా ఒచ్చిందని వాడి ఫ్రెండెవరో వచ్చి కబురు చెప్పగా, అందరం కలసి వెళ్ళి చూసొచ్చాం. మూగవాడివేషం, వాణ్ణి చూసి ముచ్చటపడి ఓ శ్రీమంతురాలైన చిన్నది హీరో చెల్లెలు వాణ్ణి ఫారిన్ తీసికెళ్ళి మాటలు రప్పిస్తుంది. నోరు విప్పిన మరుక్షణం ఆ అబ్బాయి అన్న మాటలు ''నిన్ను నేను ప్రేమించలేదు, నువ్వు నా రెండో తల్లివి. ఆ అమ్మ దేహాన్నిచ్చింది, నువ్వు వాక్కునిచ్చావు'' అంటాడు. సినిమా అయిపోతుంది.

అంతే! ఆ తరువాత వాడు మరే సినిమాలో వేసినట్టులేదు. మీ వాడేం చేస్తున్నట్టు? అని జనం అడిగే ప్రశ్నలను భరించలేక, ఫస్టు క్లాసయిన సంబంధం ఒకటి వస్తే కాదనలేక మద్రాసు బయల్దేరి వెళ్ళాను. వాడు మద్రాసులో లేడని; విజయవాడలో 'ప్రాక్టీస్' చేస్తున్నాడని చెప్పారు ఎవరో. "ఫాషన్ మేకర్స్" అని అడిగితే ఎవరైనా చెబుతారట. విజయవాడ వెళ్ళి "ఫాషన్ మేకర్స్" ఎక్కడెక్కడని భోగట్టా చేసి చివరికి కనుక్కున్నాను.

ఆ బోర్డుచూసి బిత్తరపోయాను. "ఇంత బ్రతుకూ బ్రతికి ఇంటి వెనకాల" అన్నట్టు వీరు చేసే పని టైలరింగా?

అప్పుడెప్పుడో ఒక సినిమా చూశాను. అందులో భర్త వదిలేసిన భార్య తనూ పిల్లలూ పస్తులు పడుకోకుండా వుండడానికి టైలర్‌గా బ్రతుకుతుంది. జాకెట్టుకి పావలా యిస్తామంటారు, మూడణాలే ఇస్తారు. లాగుకి బేడ యిస్తామని అణాయిచ్చి, ఈ మారు చూద్దాంలే అంటారు. రుమాళ్లు వూరికినే కుట్టమంటారు. గుడ్డ దాచేశావని అల్లరి పెడతారు. చాలా దయనీయమైనగాథ, రెండుసార్లు చూసి నాలుగు రుమాళ్లు తడిపేసుకున్నాను.

"ఇదేం పనిరా?" అన్నాను. నాకు సమాధానం చెప్పకుండా "నమస్కారం" చెప్పి షాపులో అందరికీ పరిచయం చేశాడు "మా నాన్నగారు!" అంటూ. అందరూ నిలబడి దండాలు పెట్టేరు. "పదండి" అని బయటికి వచ్చి త్రీ స్టార్ హోటల్లో ఏర్ కండీషన్ రూం బుక్ చేసి అందులో దించాడు నన్ను.

"నేనేం కాటన్ బట్టలు, లుంగీలు, డ్రాయర్లు, రుమాళ్లు కుట్టడంలేదు నాన్నా!" అన్నాడు. జేబులోంచి చెక్ బుక్ తీసి పదిహేను వేలకి చెక్కు రాసిచ్చాడు. "ప్రస్తుతానికి ఇది వుంచు. మళ్ళీ నెల్లో ఇంటికి వస్తాను."

"టెర్లిన్, టెరికాటన్, పాలిస్టర్, సిల్కు, వులెన్ - రకరకాల బట్టలు కొంటున్నారు, జనం. గుడ్డకి వందలకొద్దీ డబ్బు పోస్తున్నారు. టైలర్‌కి ముప్ఫయిరూపాయలు ఇవ్వలేరా యేమిటి? ఈ పనే బావుంది." అన్నాడు.

నేను తెల్లబోయి చూశాను.

"బెల్ బాటమ్స్, స్లీవ్‌లెస్, టాప్‌లెస్ రకరకాలు కుడ్తున్నాను. డిన్నర్ జాకెట్లు, జెర్కిన్‌లు, మాక్సీలు ఇన్నీ అన్నీ ఫాషన్లు కావు. జనం అభిరుచుల్ని జాగ్రత్తగా కాపాడుతూ బట్టలతో విశ్వామిత్ర సృష్టి చేస్తున్నాను." అని చెప్పాడు.

ఇంట్లో అప్పుడప్పుడు ఎదుర్కొంటున్న సమస్యే. టైలరుకి డబ్బు యివ్వడానికి ఎంతో కష్టం అవుతోంది. కాని దాన్ని మా వాడు ఇలా ఎదుర్కొగలడని ఊహించలేకపోయాను.

"మేం పచ్చగా బతుకుతూ వుంటే చూళ్ళేక పోతోంది గవర్నమెంటు. దారాలు, మిషన్ విడిభాగాలు, మార్కింగ్ చాక్సు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి" అని కష్టం చెప్పుకున్నాడు.

"ఇప్పుడు నా దగ్గిర ఐదురుగు పనిచేస్తున్నారు. లేడీస్ సెక్షన్‌కి ఇద్దర్ని పెట్టాను. వాళ్ళకి మంచి జీతాలిస్తున్నాను!" అన్నాడు.

మరి, వీడికి పెళ్ళి చెయ్యాలి. ఆ సంబంధం రెడీగానే వుంది. కాని 'టైలరు'కి పిల్లనిస్తారా అని అనుమానం వేసింది.

"నాకా సంబంధం అక్కర్లేదు. మా షాపులో పని చేస్తోంది ఎలిజబెత్ (టైలరు). ఆమెను పెళ్ళి చేసుకుంటాను. మా పిల్లలందరికీ టైలరింగు నేర్పుతాను. ఈ వృత్తి నాకు బావుంది" అన్నాడు వాడు.

"నీ పేరు రాబర్ట్ టైలర్ అని మార్చుకో" అని కోప్పడి వచ్చేశాను అక్కణ్ణించి.

(9-6-79)